01ATP08F_01ATP08F.qxd 08-10-2024 PM 11:01 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 09 అక్టోబర్ 2024 పేజీలు : 04

# ఆచార్య రాచపాళెంకు చం.స్పందన జీవన సాఫల్య పురస్కారం



**అనంతపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త బ్యూరో**

స్పందన అనంత కవుల వేదిక అనంత సాహితీ లోకాన్ని ఆధునిక వైపు నడిపిస్తూ, ఆధునిక కవిత్వానికి దిశా నిర్దేశం చేస్తున్న ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి చం.స్పందన ఆత్మీయ సాహితీ జీవన సాఫల్య పురస్కారంను ప్రకటించింది. స్వర్ణ భారతి సాక్షిగా, పొలి, రెండు ప్రపంచాలు వంటి కవితా సంపుటాలను వెలువరించడంతోపాటు అనేక కవిత్వ విశ్లేషణ వ్యాసాలు రాసిన సుదీర్ఘ కృషికి గుర్తింపుగా స్పందన కన్వీనర్లు ఆచార్య రాచపాళెంను 2023 చం.స్పందన ఆత్మీయ సాహితీ జీవన సాఫల్య పురస్కారానికి ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. త్వరలో అనంతపురంలో జరగనున్న జీవన సాఫల్య పురస్కార ప్రధాన సభలో ఆచార్య రాచపాళెంకు నగదు బహుమతితోపాటుగా, జ్ఞాపిక, శాలువతో ఘన సత్కార కార్యక్రమం జరుగుతుందని స్పందన అనంత కవుల వేదిక అధ్యక్షులు తూముచర్ల రాజారామ్, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర్ శాస్త్రి సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆచార్య రాచపాళెంకు చం.స్పందన జీవన సాఫల్య పురస్కారం లభించినందుకు స్పందన సభ్యులు షమీవుల్లా, అంకె శ్రీనివాస్, నందవరం కేశవరెడ్డి, రాధేయ, షేక్ నబి రసూల్, బండి నారాయణస్వామి, రాముడు, మధుర శ్రీ తదితర సాహితీ వేత్తలు హర్షం వెలిబుచ్చారు.

# టీచర్లు రియల్ ఎస్టేట్, చిటీలు, వడ్డీ వ్యాపారం చేస్తే కఠిన చర్యలు

- అలాంటి టీచర్లపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తాం
- అలా పనులు చేయడం సీసీఏ రూల్స్‌కు విరుద్ధం - ఇప్పటికే ఇద్దరు టీచర్లపై సస్పెండ్ చేశాము
- తాడిపత్రిలో ఓ టీచర్‌కు షోకాజ్ నోటీసు జారీ - హవళిగి టీచర్‌పై కూడా చర్యలు తీసుకుంటాము
- ఆ నోటీసులపై ఎంఈవోలు రిపోర్టు ఇచ్చిన వెంటనే తదుపరి చర్యలు
- అనంతపురం డీఈవో బి.వరలక్ష్మి వెల్లడి

వార్త ప్రభావం

**అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

సీసీఏ రూల్స్ ప్రకారంగా ప్రభుత్వ టీచర్లు రియల్ ఎస్టేట్, చిటీలు, వడ్డీ వ్యాపారాలు, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేయడం తప్పు అని, అలాంటి టీచర్లపై విచారించి శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిపారు. జిల్లాలోని కొందరు అయ్యవార్లు అక్రమ ఆదాయం కోసం తొక్కుతున్న అడ్డదారులపై ఈనెల 6వ తేదీ నమ్మిన వారికే శఠగోపం...!, అలాగే ఈనెల 8న అక్రమ సంపాదన కోసం...కొందరి అయ్యవార్లు అడ్డదారులు...! అనే శీర్షికలతో వార్త దినపత్రికలో కథనాలు ప్రచురితం అయ్యాయి. ఈ కథనాలు విద్యాశాఖలో సంచలనం సృష్టించాయి. రాష్ట్ర వ్యాప్తంగా సోషియల్ మీడియలో కూడా వైరల్ అయ్యాయి. అలాగే ఇంటెలిజెంట్స్ పోలీసులు కూడా ఆరా తీశారు. ఈ కథనాలపై డీఈవో స్పందించి మాట్లాడుతూ...జిల్లాలో రాప్తాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న టీచర్ రమేష్ చిటీలు నిర్వహించి రూ.కోట్లాది రుపాయిలు వెనక్కి ఇవ్వకుండా ఎగ్గొట్టారని బాధితులు అనంతపురం త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని, దీంతో అతన్ని దాదాపు 11 నెలల క్రితమే సస్పెండ్ చేశామన్నారు. అలాగే జిల్లా కేంద్రంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న టీచర్ కాకర్ల దివాకర్ నాయుడు రూ.కోట్లాది రుపాయిలు అప్పులు చేసి, తిరిగి వెనక్కి ఇవ్వలేదని బాధితులు అనంతపురం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని, దీంతో అతన్ని సస్పెండ్ చేశామన్నారు. అలాగే విడపనకల్లు మండలం హవళిగి జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న టీచర్ బద్రీనాథ్ ఈ ఏడాది జూలై 12 నుంచి మూడు రోజులు సిఎల్ పెట్టారని, తిరిగి అదే నెల 15 నుండి సెప్టెంబర్ 15 వరకు రెండు నెలల పాటు మెడికల్ లీవ్ పెట్టినట్లు యాప్‌లో అప్లై చేశారని, అయితే దానిని హెచ్‌ఎం అప్రూవల్ చేయకుండానే అప్రూవల్ అయిందని, సెలవులు పూర్తి అయిన తర్వాత తాను వీఆర్‌ఎస్ తీసుకుంటానని తనకు మిస్సెజ్ పెట్టారని, అయితే హెచ్‌ఎం వీఆర్‌ఎస్ తీసుకోవడానికి ఒక రోజు డ్యూటీకి హాజరుకావాలని, అందుకు ఒక ప్రాసెస్ ఉందని చెప్పిందని, అయితే అతను తనకు ఇబ్బంది ఉందని, అందువలను తాను రాలేనని మిస్సెజ్ ద్వారా తనకు తెలియజేసినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం మధురవాణి గుత్తి డీవైఈవోకు రిపోర్టు పంపించారని, డీవైఈవో తనకు రిపోర్టు ఇచ్చిన వెంటనే ఆ టీచర్‌కు షోకాజ్ నోటీసు ఇస్తామని, అలాగే ఆ టీచర్ గత మూడు నెలలుగా స్కూల్‌కు రావడం లేదనే విషయం డీఈవోకు తెలియజేయకుండా నిర్లక్ష్యం చేసిన విడపనకల్లు మండల ఎంఈవో-1 (అనంతపురం డీవైఈవో)కు కూడా షోకాజ్ నోటీసు జారీ చేస్తామన్నారు. అలాగే తాడిపత్రి పట్టణంలో మున్సిపల్ ప్రైమరీ స్కూల్ టీచర్ ఓ టీచర్ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఈ ఎడాది ఏప్రిల్ నెల నుండి ఈనెల 1వ తేదీ ( దాదాపు ఆరు నెలలు) వరకు స్కూల్‌కు రాలేదని, దీనిపైన ఎంఈవో-1 నాగరాజు రిపోర్టు పంపడంతో దాదాపు 25 రోజుల క్రితం షోకాజ్ నోటీసు జారీ చేశామని, అందుకు ఎంఈవో నుండి రిపోర్టు వస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు. అలాగే తాడిపత్రిలో మరో ఇద్దరు టీచర్లు, పుట్లూరు మండలంలో ఒక టీచర్, అనంతపురం రాంనగర్‌లోని ఓ మున్సిపల్ ప్రైమరీ స్కూల్ టీచర్‌పై కూడా ఎంఈవోలతో విచారణ చేయిస్తున్నామని, విచారణ నివేదిక వచ్చిన వెంటనే తదుపరి శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు ప్రభుత్వ టీచర్లు రియల్ ఎస్టేట్, చిటీలు, వడ్డీ వ్యాపారం, ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేయడం తదితర వంటిది సీసీఏ రూల్స్ ప్రకారంగా తప్పు అని అన్నారు. ఇంకా అలాంటి టీచర్లు సీసీఏ రూల్స్‌కు విరుద్ధంగా అలాంటి పనులు చేస్తుంటే ఎవరైనా తమకు రాతపూర్వకంగా ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి విచారణ చేసి శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని డీఈవో తెలిపారు.



డీఈవో బి.వరలక్ష్మి

# నూతన మద్యం షాపుల వ్యవహారం సిండికేట్ మయం

**అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త**




కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నూతన మద్యం పాలసీ తీసుకరావాలన్న ఉద్దశ్యంతో రాష్ట్ర వ్యాప్తంగా నూతన మద్యం షాపులకు సంబంధించి లాటరీ ప్రక్రియ ద్వారా కొత్త మద్యం షాపులను ఏర్పాటు చేయాలని తలంచి కొత్త మద్యం షాపులకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ సందర్భంగా అనంతపురం జిల్లాలో 136 మద్యం షాపులు, సత్యసాయి జిల్లాలో 87 మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానించింది. కానీ వాస్తవ పరిస్థితి వేరే విధంగా వుంది. కొన్ని ఏళ్లుగా మద్యం వ్యాపారం నిర్వహణ చేస్తున్న కొందరు కలిసి సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వం ఆదాయానికి గండి కొట్టాలని చూస్తున్నారు. అనంతపురం ఉమ్మడి జిల్లాకు సంబంధించి 6 వేల పైచిలుకు అప్లికేషన్లు వస్తాయని ఎక్సైజ్‌శాఖ బావించగా అందుకు భిన్నంగా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ సంఖ్యలో మద్యంషాపులకు దరఖాస్తులు చేస్తున్నారు. కొత్తవారిని దరఖాస్తు చేయనీయకుండా అడ్డుకుంటున్నారు. ఈ నెల 9న దరఖాస్తులకు చివరి తేదీగా నిర్ణయించగా ఇప్పటి వరకు అనంతపురం ఉమ్మడి జిల్లాకు సంబంధించి కేవలం 1500 లోపే అప్లికేషన్లు వచ్చాయని అధికారులు తెలిపారు. ఎంతో కీలకంగా వున్న అనంతపురం నగరం పరిధిలో 30 షాపులకు దరఖాస్తులు ఆహ్వానించగా కేవలంన 300 అప్లికేషన్లు మాత్రమే అందాయి. కొన్ని షాపులకు మరీ అధ్వాన్నంగా మూడు దరఖాస్తులు మాత్రమే అందాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు వారి అనుచరులు మాత్రమే దరఖాస్తులు చేసే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు. కొత్తవారిని దరఖాస్తు చేయకుండా ప్రలోభాలకు గురి చేస్తున్నారు. టెండర్ విధానాన్ని రద్దు చేసి లాటరీ ద్వారా షాపు కేటాయించడమే కాకుండా 20 శాతం కమీషన్ మద్యం దుకాణం నిర్వాహకునికి అందే విధంగా ప్రభుత్వం నూతన పాలసీ రూపొందించడంతో అధిక మొత్తం ఆదాయాన్ని ఆర్జించాలన్న ఉద్దేశ్యంతో మద్యం వ్యాపారులు సిండికేట్ అయ్యారనేది సమాచారం.

# పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేస్తాం




డిప్యూటి సిఎం వీడియోకాన్ఫరెన్స్ దృశ్యం



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అనంతపురం జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 14 నుండి 20వతేదీ వరకు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో సన్నద్ధంగా వున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు వివరించారు. మంగళవారం విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లు, ఉపాధి హామి సమన్వయశాఖల అధికారులతో ఉపముఖ్యమంత్రి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి పంచాయతీ వారోత్సవాలు విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ సమావేశ మందిరం నుండి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న పనులపై మంజూరు జారీ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో మౌళిక సదుపాయాల కల్పన పట్ల మరింత డిమాండ్ వుందన్నారు. ప్రభుత్వం కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. భవిష్యత్తులో మరింత మెటీరియల్ కాంపోనెంట్ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రానున్న మూడు నెలల్లో వాటిని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. ఇసుక విషయానికొస్తే కలెక్టర్ కోటాకు సంబంధించి ఐదు నుండి పది శాతం వాటిని వాడుకుంటున్నామని సిమెంట్‌కు సంబంధించి 100 బస్తాల కన్నా ఎక్కువ వుంటే సంబంధిత పోర్టల్ లోకి వెళ్లి మేనేజ్ చేయాల్సి వుంటుందని ఇదే అంశాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపినట్లుగా తాము కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో సిమెంట్ బస్తా 270 రూపాయలు వుందని దీన్ని తమ పరిధిలోని పరిష్కరించుకొని ఏదైనా సమస్యలు వస్తే వాటిని తాము అధిగమిస్తామన్నారు. స్వచ్ఛతమే జన్ జాగీదారీ అంశంలో అనంతపురం జిల్లాకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కిందని ఉపముఖ్యమంత్రికి కలెక్టర్ తెలియచేశారు. కరువు పీడత జిల్లా కాబట్టి తమ జిల్లాలో మొక్కలు నాటడం ఇదివరకే ప్రారంభించామన్నారు. రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్లో రాష్ట్రంలోనే 174 పనులు చేపట్టి జిల్లా టాప్ పొజిషన్‌లో వుందన్నారు. ఈ అంశంపై ఉపముఖ్యంత్రి పవన్‌కళ్యాణ్ ఆసక్తి చూపిస్తూ అవి ఎలా చేపట్టారో తెలపమని కోరగా గత 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక,నప్రస్తుతం తీసుకుంటున్న వందరోజుల కార్యాచరణ ప్రణాళికల్లో కూడా వీటిని ప్రాధాన్యత అంశంగా పెట్టుకున్నామన్నారు. అలాగే ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయం భవనాలపై రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్‌కి వెళుతున్నామన్నారు. ఇందులో 206 లక్ష్యానికి గాను 144 పనులను ఇదివరకే పూర్తి చేశామన్నారు. ఆ చర్యలను ఉపముఖ్యమంత్రి ప్రశంసిస్తూ వాటి గురించి తమకు తెలియచేస్తే వాటిని అందరూ పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కరువుపీడిత జిల్లా కాబట్టి జిల్లాకు అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్లను నియమిస్తే ఈ పనులను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్కారం వుంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 14 నుండి 20వతేదీ వరకు స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమిపూజలు, శంకుస్థాపనల ద్వారా పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా వున్నామని కలెక్టర్ తెలిపారు.

# ప్రశాంత వాతావరణంలో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తాం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**పుట్టపర్తి, అక్టోబర్ 08, ప్రభాతవార్త**

జిల్లాలో సాగునీటి వినియోగదారుల సంఘాలకు పటిష్టంగా ప్రశాంత వాతావరంలో ఎన్నికలు నిర్వహిస్తామని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ వివరించారు. మంగళవారం వియవాడ నుండి పెద్ద, చిన్ననీటి పారుదల క్రింద ఉన్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిర్వహించిన వీడియోకన్ఫారెన్స్ నందు స్థానిక కలెక్టరేట్ నుండి జిల్లాకలెక్టర్ టి.ఎస్.చేతన్, సంయుక్త కలెక్టర్ అభిషేక్‌కుమార్, డిఆర్ఓ కొండయ్య,జలవనరుల శాఖ అధికారులు దేశనాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ ఎన్నికలకు సంబంధిత అధికారులు పకడ్బందీగా కార్యచరణ తయారుచేయాలని ఆదేశించారు. జిల్లా పరిధిలో 230 పెద్ద,మధ్య, చిన్నతరహా సాగునీటి సంఘాలు ఉన్నాయని, ఎలాంటి లోటు పాట్లకు తావివ్వరాదన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్‌డిఓ మహేష్, పెనుకొండ ఆర్‌డిఓ ఆనంద్, కదిరి ఆర్‌డిఓ శర్మ,జలవనరుల శాఖ అధికారులు గంగాధర్, డిఇ గంగాద్రి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటింటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎన్ని సమస్యలు పరిష్కరించారు

-నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్ వసీం




మాట్లాడుతున్న నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్‌వసీం

**అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలో గత ప్రభుత్వానికి సరిచూసుకుంటే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అనంతపురం నగరాన్ని ఎంతో సుందరంగా తీర్చి దిద్దామని ఆ అభివృద్ధి మీకు కనబడలేదంటే బాధాకరమైన విషయమని నగరపాలక సంస్థ మేయర్ మహమ్మద్‌వసీం అన్నారు. మంగళవారం మేయర్ చాంబర్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అయన మాట్లాడుతూ వంద రోజుల పరిపాలన పూర్తి చేసుకుని ఇంటి వద్దకు మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎన్ని సమస్యలను పరిష్కరించారు అధికారం చేతికి వచ్చిందని నోటికొచ్చినట్లు మాట్లాడి బురదజల్లే కార్యక్రమం మొదలు పెడితే సహించేదిలేదన్నారు. అదేవిధంగా హౌసింగ్ బోర్డులో హమాలీ కాలనీలో సమస్యలు తప్ప అభివృద్ధి కనబడలేదా అని ఎద్దేవా చేశారు. నాడు నేడు కార్యక్రమంలో పాఠశాలల నాణ్యత మీరు గుర్తించలేదంటే ఎంత అవగాహన లేకుండా అవహేళన చేస్తున్నారన్నది ప్రజలు గమనిస్తున్నారన్నారు. గతంలో చంద్రబాబునాయుడు పాలనలో పాఠశాలలు ఎలా వున్నాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎలా వున్నాయో చూడాలన్నారు. మొదటి దశలో 18 పాఠశాలకు 5.40 కోట్లు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేస్తే ఆ నిధుల్లో 84 శాతం పనులు పూర్తి చేశామన్నారు. అలాగే రెండవ దశలో 33 పాఠశాలలకు 10.50 కోట్లు మంజూరు అయితే అందులో 84 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ఈ పనుల్లో పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు విద్యా కమిటీ చైర్మన్లు, ఆయా పాఠశాలల పరిధిలోని ప్రజాప్రతినిధులను కలుపుకుని నాణ్యమైన పాఠశాలలుగా తీర్చి దిద్దిన అంశాన్ని మీరు గుర్తించలేదా ఎమ్మెల్యే గారు అని ఆయన గుర్తు చేశారు. 8వతరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లు అందించిన విషయం మీరు గుర్తించలేదా అన్నారు. అలాగే ఎక్కడ సిసి రోడ్లు పెండింగ్‌లో వున్నాయో తెలపాలన్నారు. మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగరాన్ని సుందరమైన రోడ్లు, డ్రైనేజి కాలువలు, తాగునీటి సమస్యలు పరిష్కరించామన్నారు. చిన్నిచిన్న సమస్యలు వస్తుంటాయని వాటిని సరిదిద్దుకుంటూ ప్రజలకు ఇబ్బంది లేకుండా నగరంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని మీరు గమనించాలన్నారు. అభివృద్ధి జరగలేదని ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని వైసిపి నాయకుల జేబుల్లోకి వెళ్లాయని మాట్లాడడం సబబుకాదన్నారు. ఇప్పటికైనా బురదజల్లే కార్యక్రమాన్ని మానుకొని మీ పనులు మీరు చేసుకోవాలన్నారు. మీరు అభివృద్ధి చేయాలంటే మేము కూడా పూర్తి సహకారం అందిస్తామని ఆయన తెలిపారు.

# శాంతిభద్రతల పరిరక్షణే ఊపిరి

- అక్రమార్కుల పాలిట సింహస్వప్నం
- మహిళలకు అండగా 'హిట్లర్' అన్నయ్యగా పేరు
- బాధితులకు సత్వర న్యాయానికి విశేష కృషి
- భద్రత, భరోసా ఇచ్చేలా డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు విధుల నిర్వహణ
- సేవలకు ఎన్నో అవార్డులు ఆయన సొంతం

**అనంతపురం, అక్టోబరు 8, ప్రభాతవార్త ప్రతినిధి**



అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు

పోలీసు వ్యవస్థ అత్యంత బాధ్యతాయుతమైన వ్యవస్థ, విధుల పట్ల అంకితభావంతో ఉండి పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు భద్రత, భరోసా కల్పించే విధంగా పోలీసు వ్యవస్థను ఆయన పని చేసిన ప్రతి చోట నడిపించారు అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు పెట్టింది పేరు ఆయన సొంతం. ఎస్పీ ఆదేశాల మేరకు బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా తగిన చర్యలు తీసుకున్నారు. న్యాయబద్ధంగా చట్టాన్ని అమలు చేయడం పోలీసుల బాధ్యత అంటూ ముందుగా చట్టాలను స్వయంగా పాటిస్తూ అమలుకు కృషి చేస్తూ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నారు. పని చేసిన ప్రతి చోటా శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు విశేష కృషి చేశారు. దొంగతనాల నిర్మూలన కోసం నిఘా పెడుతూ అసాంఘిక కార్యకలాపాలు పాల్పడకుండా పటిష్టంగా పెట్రోలింగ్ నిర్వహించారు. ఆర్థిక నేరాలను నియంత్రించారు. పోలీసు శాఖలో ఉన్న సిబ్బంది సమస్యలను తెలుసుకుంటూ ఒక కుటుంబ సభ్యుల్లా కలిసిమెలసి వారి అండగా నిలబడ్డారు. పని చేసిన ప్రతి చోట ఉన్నతాధికారులతో ప్రశంసలు అందుకున్నారు. ఆయన చేసిన సేవలను గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అవార్డు, రివార్డులు ఆయన సొంతమయ్యాయి. మహిళా సమస్యలపై ప్రతే ్యక దృష్టి పెట్టి ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిష్కారానికి కృషి చేశారు. దీంతో మహిళలు ఆయన్ను 'హిట్లర్' అన్నయ్యగా పిలిచేవారు.

కర్నూలు జిల్లా గుడికల్లు గ్రామానికి చెందిన అనంతపురం రూరల్ డివిజన్ డీఎస్పీ వెంకటేశ్వర్లు వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారు. వ్యవసాయంలో తండ్రికి సాయంగా ఉంటూనే చదువును కొనసాగించారు. కర్నూలు జిల్లాలోనే డిగ్రీ పూర్తి చేసిన ఆయన 1992 సంవత్సరంలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. మొదటగా కర్నూలులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించారు. ఇంతటితో తన ప్రస్థానం ఆగిపోరాదని భావించిన ఆయన కఠోర దీక్షతో విధులు నిర్వహిస్తూనే ఎస్ఐ పరీక్షలకు సిద్ధమయ్యారు. పగలంతా విధులు నిర్వహిస్తూ, రాత్రి సమయంలో, వీలున్న సమయంలో ఎస్ఐ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఇలా ఆయన 1995 సంవత్సరంలో ఎస్ఐగా నియమితులయ్యారు. మొదట అనంతపురం జిల్లా యాడికి మండలంలో ఎస్ఐగా విధులు నిర్వర్తించారు. అనంతరం ముదిగుబ్బ, రామగిరి, తాడిపత్రి, నల్లమాడ ప్రాంతాల్లో ఎస్ఐగా పని చేశారు. ఫ్యాక్షన్, నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా పని చేసి శాంతిభద్రతల పరిరక్షణకు విశేష కృషి చేశారు. 2007 సంవత్సరంలో సిఐగా ఆయనకు పదోన్నతి వచ్చింది. సుమారు 6 సంవత్సరాలు హైదరాబాద్‌లోని సిఐడి విభాగంలో పని చేశారు. అక్కడి నుంచి నుంచి 2014 సంవత్సరంలో కడప జిల్లాలో సిఐగా పని చేశారు. 2016 సంవత్సరంలో అనంతపురం జిల్లాలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో సిఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతపురం నగరంలో త్రీటౌన్ సిఐగాను, పెనుకొండ, హిందూపురం, మదనపల్లి తదితర ప్రాంతాల్లో సిఐగా పని చేశారు. 2020 సంవత్సరంలో డీఎస్పీగా పదోన్నతి వచ్చింది. 2023 సంవత్సరం వరకు బాపట్లలో డీఎస్పీగా పని చేశారు.

## సేవలకు వరించిన అవార్డులు...

డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు ఆయన సర్వీసులో చేసిన అనేక సేవలకు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించి పలు అవార్డులు, రివార్డులు ప్రదానం చేసింది. ఇప్పటి వరకు ఆయన జిఎస్పీ అవార్డులు 45, ఎంఎస్పీ అవార్డులు 3పైన అందుకున్నారు. 15పైన ప్రశంసాపత్రాలు వరించాయి. ముదిగుబ్బ పోలీసుస్టేషన్‌లో ఆయన పని చేసిన తీరును ఇప్పటికీ అక్కడి ప్రజలు మరిచిపోవడం లేదు. ఆయన మంచితనానికి, శాంతిభద్రతల పరిరక్షణలో చేసిన సేవలను కొనియాడుతున్నారంటే ఆయన ఎలా నిబద్ధతతో పని చేశారో అర్థమవుతుంది. ఆయన ముదిగుబ్బలో పని చేసే సమయంలో సినీనటుడు చిరంజీవి నటించిన హిట్లర్ సినిమా విడుదల అయ్యింది. చిరంజీవికి ఐదుగురు చెల్లెల్లు ఉన్నట్టుగా, ఆయన బుల్లెట్ వాహనంలో ఎలా వెళ్తున్నారో అలాగే డీఎస్పీ వెంకటేశ్వర్లు కూడా వెళ్తుండడం చూసిన ముదిగుబ్బ ప్రజలు హిట్లర్ అన్నయ్య అని ప్రేమతో పిలిచే వారు. మహిళలు ఏదైన సమస్యను ఆయన వద్దకు తీసుకెళ్లినప్పుడు సొంత అన్నయ్యలా చొరవ తీసుకుని ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిష్కరించే వారు. ఏ సందర్భంలో ముదిగుబ్బ పోలీసుస్టేషన్‌లో ఒక్క సమస్య ఎదురైనప్పుడు సుదూరంలో పని చేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లును చాకచక్యంగా సమస్యను పరిష్కరిస్తారని ఉన్నతాధికారులు అక్కడకు పంపించారు. ఆ సమయంలో అక్కడి ప్రజలు డీఎస్పీ టి.వెంకటేశ్వర్లును భుజాలపై ఎత్తుకుని ముదిగుబ్బ పుర వీధుల గుండా ఊరేగించి జైజేలు పలికారంటే ఆయన మంచితనానికి, విధుల పట్ల చూపించే అంకిత భావానికి అద్దం పడుతుంది. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు అంటే మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి: అనంతపురం రూరల్ డీఎస్పీ టి.వెంకటేశ్వర్లు

అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎస్పీ ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తాను. పెండింగ్ కేసుల పరిష్కారానికి తమ శాఖ అధికారులతో పాటు, ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటాను. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపడానికి ప్రజల సహకారం అవసరం. ఇసుక అక్రమ రవాణా నివారణకు చర్యలు తీసుకుంటాను. పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు ఇచ్చేందుకు వచ్చే బాధితులను అతిథిగా గౌరవించాలి. వారితో మర్యాదపూర్వక ంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని ధైర్యం చెపే ్లా అన్ని చర్యలు తీసుకోవాలని స్టేషన్ల పోలీసులకు తెలిపాం. మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. పిల్లల తల్లిదండ్రులు కూడా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి. పిల్లలకు తమ వాహనాలను ఇవ్వరాదు. లైసెన్సు ఉన్న వారికి మాత్రమే వాహనాలను ఇవ్వాలి. గతంలో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పని చేశాను. దీంతో జిల్లా సమస్యలపై అవగాహన ఉంది. ప్రస్తుతం తాను పని చేస్తున్న ప్రాంతాల్లో సమస్యాత్మక ప్రాంతాల్లో గొడవలు జరగకుండా ఎస్పీ ఆదేశాలతో ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ఫ్యాక్షన్ ఏ రూపంలో లేకుండా రూపుమాపుతాం. దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. రోడ్డు ప్రమాదాల నివారణకు కూడా ప్రణాళికతో వెళ్తున్నాం. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబం ధనలను పాటిస్తే చాలా వరకు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. బెట్టింగ్, గాబ్లింగ్, పేకాట, మట్కా వంటి జోలికి వెళ్లకుండా యువత జాగ్రత్తగా ఉండాలి. చెడు మార్గంలో వెళ్లి యువత, విద్యార్థులు తమ జీవితాలను నాశనం చేసుకుంటారు. తల్లిదండ్రులు ఎంతో ఆశతో చదివిస్తున్నారు, వారి ఆశలను నెరవేర్చాలి. ఏ సమస్య ఉన్నా సరే విద్యార్థినులు, యువతులు పోలీసులను ఆశ్రయిస్తే తప్పకుండా చట్టప్రకారం ఎస్పీ ఆదేశాలతో పరిష్కరిస్తాం. ప్రజలు కూడా చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి. పోలీసులకు సహకరించాలి. ఏ సమాచారం ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు తెలియజేయాలి. శాంతిభద్రతల పరిరక్షణలో తన సిబ్బంది, ప్రజల సహకారంతో పని చేస్తాను.

# సామ్ సంగ్ ఇండియా బహుళ జాతి సంస్థ యాజమాన్యం ఇండియా చట్టాలను గౌరవించదా
## - భారత ర ఆజ్యాంగం ప్రకారం నడుచుకోవాల్సిందే - కార్మిక చట్టాలు అమలు చేయాల్సిందే..
## - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగుట్ట నాగేంద్రకుమార్

అనంతపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త బ్యూరో
సిఐటియు జాతీయ కమిటీ పిలుపు మేరకు తమిళనాడు పెరంబదూర్ సామ్‌సంగ్ ప్లాంట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అనంతపురం సప్తగిరి సర్కిల్ లలిత కళాపరిషత్ మెయిన్ రోడ్డు వద్ద సాంసంగ్ షోరూమ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సోమగుట్ట నాగేంద్రకుమార్‌మా ట్లాడు తూ.. తమిళనాడు శ్రీపెరంబదూర్ ప్రాంతంలోని సాంసంగ్ పరిశ్రమలో గత కొన్ని నెలలు నుంచి 2వేల మంది కార్మికులు ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరుతూ ఆందోళన కొనసాగిస్తున్నా యాజమాన్యం మొండి వైఖరి కారణంగా సెప్టెంబర్ 9 నుంచి నిరవదిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. దక్షిణ కొరియాకు చెందిన బహుళ జాతి సంస్థ సాంసంగ్ భారతదేశంలో కార్య కలాపాలు నిర్వహిస్తున్నప్పుడు, భారత రాజ్యాంగాన్ని, కార్మిక చట్టాలను గౌరవించాలని, రాజ్యాంగం ప్రకారం కార్మికులు సంఘం పెట్టుకునే హక్కును గుర్తించాలని, పని వేళలు మార్చాలని, తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, పిఎఫ్, ఈఎస్ఐ చట్టాలను అమలు, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచేదాకా ఈ సమ్మె చేసే కార్మికులకు దేశ వ్యాప్తంగా మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ప్రపంచ సాంసంగ్ వ్యాపారంలో 20 శాతం భారతదేశం నుంచే లాభాలను తీసుకుంటూ, భారత కార్మికులను బానిసలుగా చూడడం మానుకోవాలని హెచ్చరించారు. దక్షిణ కొరియాలో పని చేసే కార్మికులకు 13వేల డాలర్లు చెల్లిస్తూ, భారతదేశ కార్మికుడికి 300 డాలర్లు మాత్ర మే చెలి ్లంచడాన్ని తప్పుపట్టారు. బిజె పి, ఆర్ఎస్ఎస్ పెద్దలు ఆత్మ నిర్భర్ భారత్, మేక్ ఇన్ ఇండి యా, స్వదేశీ నినాదం ఇవ్వడమే కాదని విదేశీ బహుళ జాతి కంపె నీ అయి నా సాంసంగ్ భారత కార్మికుల పట్ల వ్యవహ రిస్తున్న అనాగరిక చర్యలను ఖండించి, భారత రాజ్యాంగం ప్రకారం నడుచు కునేలా, కార్మిక చట్టాల అమ లు కోసం సాంసంగ్ యాజమాన్యాన్ని ఆదేశిం చాలని సెలవిచ్చారు. తమిళ నాడు ప్రభుత్వం పెట్టుబడులను ఆకర్షించాలనే పేరుతో కార్మికుల పోరాటా లను పోలీసులతో నిర్బంధంతో ముగించాలని చూస్తే దేశ వ్యాప్తంగా ఉద్యమి స్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటి యు నగర అధ్యక్ష, కార్యదర్శిలు శ్రీనివాసులు, వెంకట్ నారాయణ, బండారు ఎర్రిస్వామి, తిరుమలేష్, నాగరాజు, ఆజాం బాషా, భాస్కర్, జిలాన్‌బాషా, శ్రీనివాసమూర్తి, కుమార్, హరి, పెద్ద కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

# కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులుగా మళ్లీ గాంధీ నియామకం
## - నేతలకు కృతజ్ఞతలు తెలిపిన గాంధీ

అనంతపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త బ్యూరో
ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు మరోసారి నియమించినందుకు కాంగ్రెస్ అగ్రనాయకత్వానికి మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు దాదాగాంధీ కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేకి, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు రాహుల్ గాంధీ సోనియాగాంధీ ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కెసి వేణుగోపాల్, జనబ్ ఇమ్రాన్ ప్రతాప్ ఘర్హీ జి నాషనల్ మైనార్టీ చైర్మన్ ఏపిసిసి చీఫ్ వైఎస్ షర్మిలరెడ్డికి, ధన్యవాదాలు తెలిపారు.
ఏపి కాంగ్రెస్ రథసారథి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తనయ వైఎస్.షర్మిలారెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మైన ార్టీలను ఏకతాటిపైకి తీసుకొస్తామని దాదాగాంధీ తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఈ దేశంలో సెక్యులర్ పార్టీ అని, మైనార్టీలంతా కాం గ్రెస్ పక్షాన నిలవాలని కోరారు. 2004 నుంచి క్రియాశీలకంగా ఉన్న తనను గుర్తించడం, కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తకు పెద్దపీట వేస్తా రనడానికి ఉదాహ రణ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ద్వా రానే అన్ని కులాలు, మతాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సెక్యులర్ భావాలు కలిగిన ఏకైక పార్టీ కాంగ్రె స్ మాత్రమే అని చెప్పారు. తనను గుర్తించి మరో సారి మైనార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించి నందకు శక్తి వంచన లేకుండా పని చేస్తానని దాదా గాంధీ తెలిపారు.


వైఎస్ షర్మిలతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దాదాగాంధీ

# పల్లె పండుగ పంచాయితీ వారోత్సవాలను విజయవంతం చేద్దాం
## - ఎంపిడిఓ నిర్మలాకుమారి

శింగనమల, అక్టోబర్ 8 ప్రభాతవార్త
రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలలో అక్టోబర్ 14 నుంచి 20వ తేది వరకు నిర్వహించే పల్లె పండుగ పంచా యితీ వారోత్స వాలను విజయవంతం చేద్దామని ఎంపిడిఓ నిర్మలాకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో ఆమె ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలో చేపట్టనున్న పనులకు వంద శాతం మంజూరు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని, 14 నుంచి 20వ తేది వరకు నిర్వహించే కార్యక్రమాలలో స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో భూమి పూజలు, శంకుస్థాపనల ద్వారా పనులను ప్రారంభించేందుకు సిద్దంగా ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఈ పల్లె పండుగ వారోత్స వాలలో చేపట్టే భూమిపూజ, శంకుస్థాపనల్లో సర్పంచులు, స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ భాగస్వామ్యం కావాలని అలగే, వారోత్స వాలపై ప్రజల్లో అవగాహన కల్పించి చేపట్టే పనుల వివరాలను గ్రా మాల్లో ప్రదర్శించాలని సూచి ంచారు. గ్రామాల్లో మరిం త పారదర్శకత, ప్రజల్లో జవాబు దారి తనం పెంచడానికి ఒక పండుగ వాతావరణంలో ఈ వారోత్స వాలను నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ శ్రీదేవి, ఈఓఆర్డి ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపిడిఓ నిర్మలాకుమారి

# పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరైన అనంత

అనంతపురం సిటీ,
అక్టోబర్ 8 ప్రభాతవార్త
నగరంలోని 50వ డివిజన్ కార్పోరేటర్ గురుశేఖర్ బాబు ఆధ్వర్యంలో పారిశుద ్య కార్మికులకు ఏర్పాటు చేసి దుస్తుల పంపిణీని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి చేతులు మీదుగా పంపిణీ చేశారు. 50వ డివిజన్ ఫరిధిలోని ననకకోట ముత్యాలమ్మ దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా మంగళవారం అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గురుశేఖర్‌బాబు, మాజీ కార్పో ేంటర్ హిమబిందులు కలిసి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ ఫరిధిలో పని చేస్తున్న పారిశుద్ద్య కార్మికులకు అనంత వెంకరామిరెడ్డి చేతులు మీదుగా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందించారు. అదే విధంగా నగరంలోని హౌసింగ్ బోర్డు వెంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రాత్రి నిర్వహించిన రథోత్స వం కార్యక్రమంలో అనంత వెంకట రామిరెడ్డి హాజరయ్యారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు ధర్మకర్తలతో కలిసి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు కమిటీ సభ్యులతోపాటు జేసిఎస్ జిల్లా కన్వినర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కార్మికులకు దుస్తులను పంపిణీ చేస్తున్న అనంత

# మండలంలో తొలిసారిగా పొగాకు సాగు చేసిన రైతు


పొగాకు సాగు చేసిన దృశ్యం


ఆకును పరిశీలిస్తున్న రైతు నాగభూషణం

శింగనమల, అక్టోబర్ 8 ప్రభాతవార్త
మండల పరిధిలోని పెద్ద జలాలపురం గ్రామంలో రైతు ఆర్.నాగభూషణం తొలిసారిగా పొగాకు సాగు చేశారు. కొందరు రైతులు గ్రామంలో దిగుబడి రాదు అని చెప్పినా చూద్దాం ఒక సారి ప్రయత్నిద్దామని రైతు నాగభూషణం పొగాకు సాగును ఎంచుకున్నారు. 40 రోజులకే పొగాకు ఏపుగా పెరగడం చూసి సాటి రైతులు ఆశ్చర్యంతో నాగభూషణంను కలిసి వివరాలు సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. ఒక క్వింటాలు దాదాపు పొగాకు 15వేలు విలువ చేస్తుందని, దాదాపు 4.50 ఎకరాల్లో పొగాకు సాగు చేసినందుకు 80 వేలు పెట్టుబడి అయిందన్నారు. 40రోజులు పైరు అయిన ఇప్పటి వరకు మందులు ఏవీ వాడలేదని రైతు తెలిపారు. త్వరలోనే దిగుబడి కోత కోస్తే ఆదాయం ఏమేరకు వస్తుందో తెలుస్తుందని, మొదటిసారి కావున తాను కూడా ఆదాయంపై సరైన అంచనా వేయలేకపోతున్నానన్నారు. పంట ఉన్న పరిస్థితిని చూసి అధిక దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు కనిపిస్తోందన్నారు.

# .ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పట్టణ అభివృద్ధికి కృషి చేయండి
## - గ్రామ పంచాయితీ సెక్రెటరీ గోపాల్‌ను సన్మానించిన టిడిపి నాయకులు

పామిడి, అక్టోబర్ 8 ప్రభాతవార్త
.ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పట్టణాన్ని అభివృద్ధి చేయాలని టిడిపి నాయకులు గ్రామ పంచాయితీ సెక్రెటరీ గోపాల్‌ను కోరారు. గ్రామ పంచాయితీ సెక్రెటరీగా బాధ్యతలు చే ్టిన గోపాల్‌ను మంగళవారం కలిసిన టిడిపి నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సెక్రెటరీ గోపాల్ మాట్లాడు తూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి పాటు పడుతా మని తెలిపారు. పట్టణంలో ఇప్పటి వరకూ చేపట్టిన, చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్షించి ప్రజాప్రతినిధులు అధికారుల సమన్వయంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆమె వెల్లడించారు. గ్రామ పంచాయితీ సెక్రెటరీ గోపాల్‌ను కలిసిన వారిలో టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్ చౌదరి, బొల్లు శ్రీనివాసరెడ్డి, జింకల సంజీవకుమార్, గౌసు పీర, బొమ్మా మోహన్, వడ్డే శివ, మహ్మద్ రఫీ, నల్లబోతుల శ్రీనివాసు, రంగనాయకులు, వెంకటరమణ, తిమ్మప్ప, మల్ల య్య, ఓబులేసు, అశోక్, శివ అభిరామ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ పంచాయితీ సెక్రెటరీ గోపాల్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

# సహకారం అందిస్తాం.. మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించండి
## - ఎంపిడిఓ తేజోష్ణను కోరిన టిడిపి నేత ఆర్.ఆర్.రమేష్

పామిడి, అక్టోబర్ 8 ప్రభాతవార్త
గుంతకల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలన్నదే ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన తనయుడు పామిడి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ లక్ష్యమని మా సహకారం ఎల్లవేళలా ఉంటుందని మండలానికి అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపిడిఓ తేజోష్ణను టిడిపి నేత ఆర్ఆర్.రమేష్ కోరారు. ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన తేజోష్ణ, ఈఓఆర్డి కృష్ణకుమార్‌లను మంగళవారం కలిసిన టిడిపి నేత ఆర్ఆర్.రమేష్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఆర్.రమేష్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా మండల అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. ఎంపిడిఓ తేజోష్ణ మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి పాటుపడుతామని తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ చేపట్టిన చేపట్టబోయే అభివృద్ధి పనులపై సమీక్షించి ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆమె వెల్లడించారు. ఎంపిడిఓ తేజో ష్ణను కలిసిన వారిలో టిడిపి నాయకులు రాజేష్ నాయక్, వడ్డే ఆనంద్, పల్లె శ్రీనివా సులు, రమేష్‌నాయక్, సంకప్ప, వెంక టేష్, దేవదాసు, వడ్డే సుదర్శన్, నాగ భూషణ్, శ్రీనివాసులు, వీరాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


ఎంపిడిఓ తేజోష్ణను సన్మానిస్తున్న టిడిపి నేత ఆర్ఆర్.రమేష్

# నూతన ఎంపిడిఓ విజయలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసిన టిడిపి సీనియర్ నాయకులు

రాప్తాడు, అక్టోబర్ 8 ప్రభాతవార్త
రాప్తాడు మండల నూతన ఎంపి డిఓగా బుల్లె విజయలక్ష్మి బాధ్య తలు స్వీకరించారు. మండల కేంద్రంలోని టిడిపి సీనియర్ నాయకులు ఎంపిడిఓ విజయలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా వేసి పూల బొకేతో ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడు తూ.. విధులలో పారదర్శకంగా పని చేయాలన్నారు. మండల అభివృద్ధికి తోడ్పాటు అందించాలనికోరారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుద్య పనులపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి అంటు వ్యాధులు ప్రబలకుండా దోమలు నివారణకై బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఉప్పరపల్లి రాముడు, నాగరాజు, చిల్లర లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎంపిడిఓకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న టిడిపి నేతలు

# శ్రీమహాలక్ష్మిగా చౌడేశ్వరి అమ్మవారు

అనంతపురం కల్చరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త
అనంతపురం నగరం గుత్తి రోడ్డులో వెలసిన శ్రీచౌడేశ్వరి దేవి ఆలయంలో దేవి నవరాత్రి ఉత్స వాలలో భాగంగా 6వ రోజున శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భ ంగా తరలి వచ్చిన భక్తాదులు అమ్మవారిని దర్శించుకుని ఆలయ అర్చకులు అందించిన తీర్థప్రసాదాలను స్వీకరించారు.

# కొల్హాపూర్ మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

శింగనమల,
అక్టోబర్ 8 ప్రభాతవార్త
దేవి నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా మండల కేంద్రంలోని నగరేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం వాసవి మాత కొల్హాపూర్ మహాలక్ష్మి అలంకర ణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనా న్నరు.


.ప్రత్యేక అలంకరణల ో వాసవి మాత

# నూతన ఎంపిడిఓను కలిసిన టిడిపి నాయకులు

కూడేరు,
అక్టోబర్ 8 ప్రభావార్త
కూడేరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మంగళవారం నూతనంగా పదవీ బ ాధ్యతలు చేపట్టిన ఎంపిడిఓ కుళ్లాయిస్వామిని మర్యాద పూర్వకంగా కలిశారు. వారు ఎంపిడిఓ పుష్పగుచ్ఛం అందజేసి నూతన ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు అయ్యేలా కృషి చేయాలని కోరారు. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అమలు ఎలా జరుగుతుందని వివరించారు. ఎంపిడోతోపాటు పంచాయితీ రాజ్ ఏఈ రమణయ్యను, ఐకేపి వెలుగు ఏపిఎం దేవానంద్ ఫిలిప్స్, ఏసి సుభద్రమ్మను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల నాయ కులు జయప్రకాష్‌గౌడ్, బాట వెంకటేష్, నారాయణస్వామి, బొమ్మయ్య, సర్పంచు భర్తచిన్న ఈశ్వరయ్య, గొల్ల వెంకటేష్ యాదవ్, శ్రీధర్‌నాయుడు, భీమా, ధనంజి, రమేష్, నాగరాజు, కుళ్లాయిస్వామి, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


నూతన ఎంపిడిఓకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న టిడిపి నాయకులు

# ఉపాదిహామి పథకం పై విచారణ చేపట్టండి


మాట్లడుతున్న చెదుళ్ళ మాజి సర్పంచు నారాయణస్వామి

బుక్కరాయసముద్రం అక్టోబర్ 8 ప్రభాతవార్త
ఉపాదిహామి పథకంలో అవి నీతి జరిగిందని వాటిపై ప్రభుత్వ ఉన్నత అదికారులు విచారణ చేపట్టి అదికారుల పై చర్యలు తీసుకోవాలని బుక్కరాయస ముద్రం మండలం చెదుళ్ళ గ్రామ మాజి సర్పంచు నారాయ ణస్వామి డిమాండు చేశారు.మ ంగళవారం బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లడుతూ గత మూడు నెలల నుండి చెదుళ్ల గ్రామంలో ఉపాదిహామి పథకం కింద పునులు చేపట్టకున్నా అదికారుల చేతివాటంతో పనులు చేసినట్లు మస్టర్‌ను తయారుచేసి ప్రభుత్వ సొమ్మును దుర్వినీయోగం చేశారని వాటి పై విచారణచేపట్టి అదికారుల పై చర్యలు తీసుకోవాలని కోరారు.న

# కలెక్టర్‌ను కలిసిన నల్లాని రాజేశ్వరి

అనంతపురం, అక్టోబర్ 8 ప్రభాతవార్త బ్యూరో
.ప్రముఖ విద్యావేత్త, రచయిత్రి, కవయిత్రి, సామాజిక వేత్త, కేంద్ర ప్రభు త్వ రాజ్యమహిళా సమ్మాన్ అవార్డు గ్రహీత, ఎన్ఆర్ఐ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నల్లాని రాజేశ్వరి మంగళవారం జిల్లా కలెక్టర్ డా.వి. వినోద్ కుమార్‌ను కలి శారు. కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తాను రచించిన వ్యాసాల సంపుటి సాధికార స్వీయ కవితా సంపుటి బంగారుతల్లి పుస్తకాలను కలెక్టర్‌కు బహుకరించారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలికావిద్య, మహిళా సాధికారత కోసం తాను చేస్తున్న కార్యక్ర మాలను నల్లాని వివరించారు. గతంలో తాను జిల్లా బాలల సంక్షేమ సమితి (సిడబ్ల్యూసి) చైర్‌పర్సన్‌గా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు, అనాథ పిల్లల సంరక్షణ, వీధి బాలల సంక్షేమానికి చేసిన కృషిని ప్రత్యేకంగా నివేదించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యాహక్కు చట్టం పట్టిష్ట అమలుకోసం అప్పటి ప్రభుత్వం రాష్ట్ర సలహామండలి సభ్యురాలిగా తనను నియమించిందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నల్లాని సేవలను ప్రశంసించారు. నల్లాని వెంట ఎన్ఆర్ఐ ఫౌండేషన్ సిఐఒ గుత్తా హరి సర్వోత్తమ నాయుడు ఉన్నారు.


కలెక్టర్‌తో మాట్లాడు తున్న నల్లాని రాజేశ్వరి

# శ్రీ అన్నపూర్ణాదేవి దర్శనమిస్తున్న శ్రీపెద్దమ్మతల్లి అమ్మవారు

పామిడి,
అక్టోబర్ 8 ప్రభాతవార్త
మండల పరిధిలోని ఓబులాపురం గ్రామంలో దసరా శరన్న వరాత్రుల ఉత్స వాల్లో భాగంగా మంగళవారం శ్రీ అన్నపూ ర్ణాదేవిగా భక్తులకు దర్శనమి చ్చారు. పట్టణంలోని శ్రీ భోగే శ్వర స్వామి దేవాలయంలో శ్రీప్రసన్న పార్వతీ అమ్మవారిని శ్రీ లక్ష్మిదేవిగా అలంకరించి శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేశారు. ఇదిలా ఉండగా శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీలలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం బాలలకు భక్తి శ్లోకాల పోటీలు నిర్వహించారు. కొందూరు రోడ్డులోని అంకాలమ్మ, కుంటే మ్మ, అనుంపల్లి సుంకులమ్మ, గజరాంపల్లి సుంకులమ్మ దేవాలయాల్లో అమ్మవా ర్లను అలంకరణ చేసి పూజలు చేపడుతూ అన్నదానం చేపట్టారు.


శ్రీ అన్న పూర్ణాదేవిగా దర్శనమిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారు

# రాచానపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహణ

అనంతపురం రూరల్,
అక్టోబర్ 08 ప్రభాతవార్త:
అనంత రూరల్ మండలం రాచానపల్లి, అక్కంపల్లి పంచాయితీలోని రైతు సేవా కేంద్రాల సమీపంలోని రైతుల పొలాల్లో ఏడిఏ రవి, ఏఓ శశికళ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులు వేసిన కంది, వేరుశెనగ పంటలను పరిశీలించి రైతులకు వేరుశెనగ, కంది పంటలలో వచ్చు చీడ పీడల నివార ణకు గల సస్యారక్షణ చర్యల గురించి సలహాలు, సూచనలు చేసి రైతల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం వారు మట్టి పరీక్ష ఫలితాల కార్డులు, కౌలు రైతు కార్డులను అందజేశారు. అనంతరం రాచానపల్లిలో రైతు కృష్ణారెడ్డి వేచిన కంది పంటను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ మురళికృష్ణ, ఉద్యాన విస్తరణ అధికారి రామాంజినేయులు, రైతు సేవా సిబ్బం ది శివశంకర్, ఇతర శాఖ సిబ్బంది హరిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.


రాచానపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు.

# వైసీపీ రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి జన్మదిన వేడుకలు

బుక్కరాయసముద్రం,
అక్టోబర్ 8 ప్రభాతవార్త
వైసీపీ రాష్ట్ర బిసి సెల్ ప్రదాన కార్యదర్శి మడకశిర చంద్రమోహన్ జన్మ దిన వేడుకలు మంగళవారం బుక్కరాయ సముద్రం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణంలో ఘనంగ నిర్వహి ంచారు. జన్మదిన సందర్భంగ ఆయన అభిమాను లు, శ్రేయో భిలాష్‌లు ఆయనచేత కేక్‌కట్‌చేయిం చారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వైసీపీ పార్టీలో మరెన్నో ఉన్నతపదవుచేపట్టాలని అభిమానులు కోరారు. అనంతరం చంద్ర మోహన్ పంచాయితీ పారిశుద్ధ్య కార్మికులకు పుట్టినరోజు సందర్భంగ అన్న దానకార్యక్రమం నిర్వహిం చారు.. ఈ సందర్భంగ ఆయన మ్మాట్లడుతూ పంచాయితీ కార్మికుల సేవలు వెలకట్టలేనివి వారు ప్రజారోగ్య ప్రదాతలని పంచాయితీ కార్మికులు సమాజం నిద్రలేవకముందే గ్రామాలు, పట్టణాలు, నగరాలను శుభ్రంచేసి ప్రజలకు ఆరోగ్య పారిశుద్ధ్య పరిరక్షణలో నిత్యం సేవలు అందిస్తున్నారని కొనియా డారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు పార్వతి, వడ్డే రామాంజి, కడ్డీలు వెంకటేష్, గాంధీనగర్ ప్రసాద్, రుద్రప్ప, పెద్దన్న, నరేంద్ర తదితిరులు పాల్గొన్నారు.


చంద్రమోహన్ జన్మదిన వేడుకలు సందర్భంగ కేక్‌కట్‌చేస్తు దృశ్యం

# కంది సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన
## పంపనూరు, గోరిదిండ్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఆత్మకూరు ఆక్టోబర్ 8 ప్రభాతవార్త
రైతులు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచుకొని అధిక దిగుబడుల సాధనకు పొలం పిలుస్తుంది కార్యక్రమం ఉపయోగంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారిని సుచరిత స్పష్టంచేశారు. పంపనూరు, గోరిదిండ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో సాగుచేసిన కందిపంటను పంపనూరు, గోరిదిండ్ల గ్రామాల్లో పరిశీలించారు. కందిపంటలో అధిక దిగుబడి సాధించడానికి కందిలో శనగపచ్చ పురుగు నివారణకు, సమగ్ర యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు తెలియజేశారు. శనగపచ్చ పురుగులార్వాలను తినుటకు అనుగుణంగా ఎకరానికి 10-15 పక్షి స్థావరాలను ఏర్పరచాలని, శనగపచ్చ పురుగుల ఉనికిని గమనించుటకు ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చాలని రైతులకు సూచించారు. పురుగుగ్రుడ్లు, తొలిదశ లార్వాల నివారణకు 5 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారి చేయాలిని, పురుగు ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు 1.5గ్రా, ఎసిఫేట్ లేదా 2 మి,లీ క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కం దిలో ఆకుమచ్చ పురుగు ఆశిం చిదని వాటి నివారణకు 1.6 మి,లీ మోనోక్రోటోపాస్, లేదా 2 మి,లీ కిన్వాల్పాస్ 2.5మి,లీ క్లోరోపైరిఫాస్ మందును పిచి కారి చేయాలన్నారు. వేరుశె నగలో టిక్కా ఆకుమచ్చ తెగు లు గమనించామని వాటి నివారణకు 1.0 మి,లీ టేబ్యుకోనజోల్ లేదా 2 గ్రాములు క్లోరోదాలోనిల్ మందును లీటరుక నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ శ్రీనివాసులు, ఆర్ఎస్ఓ సిబ్బంది, రైతులు పాల్గోన్నారు.


పొలం పిలుస్తుంది కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

# గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుద్దాం..!
## - పరిశుభ్రతపై అవగాహన కల్పించిన ఎంపిడిఓ లక్ష్మినరసింహ

ఆత్మకూరు ఆక్టోబర్ 8 ప్రభాతవార్త
గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకొనుట గ్రామంలో గల ప్రతి ఒక్కరి బాధ్యతని ఎంపిడిఓ లక్ష్మినరసింహ పేర్కొ న్నారు. మండలంలోని పంపనూరు, బి,యాలేరు గ్రామాల్లో పరిశుభ్ర తపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో గల చెత్తది బ్బలు తొలగి ంచడం, గ్రామంలో గల ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా జాగ్రతలు తీస ుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంపనూరులో గల హోటల్ యజమానులకు, దుకాణాల యజ మానులకు చెత్త బయటపడ ేయ కూడదని చెత్త వేయడానికి చెత్తకుండీలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పంపనూరు పుణ్యక్షేత్ర మని గ్రామాన్ని శుభ్రంగా ఉంచు కోవడం అవసరం తెలిపారు. ఈ కార్యక్ర మంలో యంపిపి హేమలత, స్థానిక సర్పంచ్ ఎర్రిస్వామి, పంచాయితీ కార్యదర్శులు శిరీష, సింగంపల్లి కార్యదర్శి శిరీష, విఆర్ఓ ప్రసాద్, సర్వేయరు మనోజ్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.


పంపనూరులో చెత్తను పంచాయితీ కార్మికులతో తొలగింపజేస్తున్న అధికారులు

# దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ

అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త
నగరంలోని సుభాష్‌రోడ్డులో గల శ్రీకృష్ణదేవరాయ భవన్ ప్రాంగణంలో అనంతపురం అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్న వరాత్రి ఉత్స వాల్లో అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అర్బన్‌బ్యాంకు చైర్మన్ మురళీధర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్స వాల్లో భాగంగా మంగళవారం శ్రీమహాలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమి చ్చారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ దేవినవరాత్రి ఉత్స వాలు అర్బన్ బ్యాంకు పాలకవర్గం రెండవ సారి నిర్వహించడం చాలా శుభపరిణ ామమన్నారు. ఇందులో భాగంగా తనకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగిం చినందుకు అనంతపురం అర్బన్‌బ్యాంకు పాలకవర్గం వారికి ధన్యవాదాలు తెలియచేశారు. 100 సంవత్స రాల చరిత్ర కలిగిన అర్బన్ బ్యాంకు సేవలు అనంత నగర ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని బ్యాంకింగ్ రంగంలో అనంతలోనే అగ్రస్థానం సంపాదించుకోవాలని, బ్యాంకు అభివృద్ధి చాలా వేగంగా పుంజుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్ గోల్డ్ బాష, వడ్డె వెంకటాద్రి, పాలకవర్గం సభ్యులు రోళ్ల భాస్కర్, జె.రామాంజినేయులు, మాగిశెట్టి చంద్రశేఖర్, కృష్ణకుమార్, బావిగడ్డి రమణయ్య, సుంకర రమేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# 30లోపు స్కాలర్ షిప్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయండి

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త
2024-25 విద్యా సంవత్స రానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ పథకము కింద అర్హులైన విద్యార్థుల దరఖాస్తులను రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ చేయడానికి సేవలను జ్ఞానభూమి వెబ్‌సైట్ పోర్టల్ కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌లో పొందుపరచడం జరిగిందని సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఖుష్బూ కొఠారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున దరఖాస్తుల ఫ్రెష్, రెన్యువల్ నమోదు ప్రక్రియ మొత్తం ఈనెల 30వ తేదీ లోపు పూర్తి చేయాల్సి ఉంటుందని, కావున మీ కళాశాలలోని స్కాలర్‌షిప్ విభాగములో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి తక్షణమే విద్యార్థుల రెన్యువల్, ఫ్రెష్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు.

# ప్రయాణ ప్రాంగణం..పడగొట్టే యత్నం..!

## - తలకు మించిన భారమని తొలగించే యత్నం - కూల్చివేత యత్నాన్ని అడ్డుకున్న తెదేపా నాయకులు - ఫిర్యాదు ఇవ్వలేని సందిగ్ధంలో రవాణాశాఖ అధికారులు


తొలగింపు చర్యలకు గురైన యాడికి బస్టాండు


ప్రయాణ ప్రాంగణంలో తొలగించిన పునాది రాళ్లు


తాడిపత్రి డిపో మేనేజర్‌కు వినతినిస్తున్న తెదేపా నాయకులు

యాడికి(తాడిపత్రి), అక్టోబరు 8, ప్రభాతవార్తః యాడికి మండలంలోని ప్రయాణికులను దృష్టిలో ఉంచుకొని వేములపాడు రోడ్డులోని సర్వే నంబరు 487 -ఏ3లో నిర్మించిన ప్రయాణ ప్రాంగణాన్ని సోమవారం కొందరు నాయకులు పడగొట్టే యత్నం ఉద్రిక్తతకు దారితీసింది. ప్రయాణికులకు నీడనిచ్చేందుకు నిర్మించిన నిర్మాణాన్ని పడగొట్టి మరో నిర్మాణం చేపట్టాలనే దురుద్దేశంతోనే కొందరు వైకాపా నాయకుల సహకారంతో వేలంపాట దారుడు ఇలా కూల్చివేతకు ప్రయత్నిస్తున్నాడని మండల తెదేపా నాయకులు ఆరోపిస్తూ అడ్డుకున్నారు. ప్రజా ప్రయోజనం కోసం చేపట్టిన ఇలాంటి నిర్మాణాలను కూల్చివేసేందుకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తాడపత్రి డిపో మేనేజర్ లక్ష్మిశంకర్‌కు వారు వినతి పత్రమందించారు. సోమవారం ఉదయం కొందరు కూలీలు జేసీబీతో బస్టాండును కూల్చి వేస్తున్న విషయం తెలుసుకున్న తెదేపా నాయకులు ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేస్తే ఎలా అంటూ ఘటనా స్థలానికి వచ్చి అడ్డుకున్నారు. డిపో మేనేజర్‌కు వారు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో డీఎం లక్ష్మిశంకర్ కూడా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి పోలీసుస్టేషన్‌కు తరలివచ్చారు. డీఎమ్ తో పాటు వైకాపా, తెదేపా నాయకులు పెద్దఎత్తున పోలీసు స్టేషన్‌కు తరలిరావడంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారితీసింది. అయితే ఫిర్యాదు ఇవ్వడానికి ఉన్నతాధికారుల అనుమతి కావాలంటూ డీఎమ్ వెనుదిరిగి వెళుతుండగా తెదేపా నాయకులు ఆయనకు వినతి పత్రమందజేశారు. అనంతరం తెదేపా నాయకులు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డిని కలిసి ప్రభుత్వ ఆస్తుల కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేసిన తమను కూల్చివేసేదే అంటూ దుర్భాషలాడిన వైకాపా నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, కాసా చంద్రమోహన్, రాచమల్లు శివ, శశి, రాజు తదితరులపై తగిన చర్యలు తీసుకోవాలని తెదేపా నాయకులు రుద్రమనాయుడు, రంగయ్య, రాజశేఖర్, నాగమునిరెడ్డి, లక్ష్మణ్, రామకృష్ణ, మధురాజు, నాగేశ్వర్ తదితరులు వినతిని అందజేశారు. ఈ సంఘటనపై సోమవారం రాత్రి వరకు ఎలాంటి ఫిర్యాదు అందక పోవడంతో పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేక పోయారు. ఈ బస్సుప్రయాణ ప్రాంగణం దశాబ్దానికి పైగా నిరుపయోగం గా ఉండటంతో 2023 జులైలో 15 ఏళ్ల కాల వ్యవధితో నెలకు రూ. 63 వేల అద్దె రుసుము, దీనికి ఆరు రెట్లు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించేలా గుంతకల్లుకు చెందిన సూర్యచంద్రా రెడ్డి వేలం పాటలో దక్కించుకున్నాడు. కొన్ని నెలల పాటు ఇందులో గొర్రెల సంత నిర్వహణతో అద్దె సొమ్ము రాబట్టుకున్న వేలం పాటదారుడు ప్రస్తుతం ఆ వెసలుబాటు లేకపోవడంతో అద్దె చెల్లింపు తలకు మించిన భారంగా మారిందని తెలుస్తోంది. దీంతో బస్టాండు నిర్మాణాన్ని కూల్చివేసి మరో నిర్మాణం చేపట్టాలనే ఆలోచనతో స్థానిక వైకాపా నాయకుల సహకారంతో ఈ చర్యకు పూనుకున్నారని తెదేపా నాయకులు ఆరోపిస్తున్నారు. రవాణా శాఖ చేపట్టిన బస్టాండు నిర్మాణాన్ని ధ్వంసం చేయకుండా వేలం పాట దారుడు మరో నిర్మాణం చేపట్టవచ్చని, వేలం దక్కించుకున్నప్పుడు ఏ స్థితిలో ఉంటే అదే స్థితిలో తిరిగి రవాణాశాఖకు అప్పగించాలనేది నిబంధన అని రవాణాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ తతంగంపై డిపో మేనేజర్ లక్ష్మిశంకర్‌ను వివరణ కోరగా పై అధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సంఘటన జరిగి 48 గంటలు దాటినా దీనిపై ఎలాంటి ఫిర్యాదు చేయకపోవడం రవాణా శాఖ నిర్లక్ష్యానికి నిదర్శమని స్థానికులు పేర్కొంటున్నారు.

# రాష్ట్రంలో 60 లక్షల టన్నుల ఇసుక దోచేశారు..

## - సంపద సృష్టి టీడీపీ నేతలకేనా - మద్యం టెండర్లలో కూటమి నేతల దౌర్జన్యాలు - అనంత వెంకటరామిరెడ్డి విమర్శ



సమావేశంలో మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం సిటీ, అక్టోబర్ 8 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రాత్రికి రాత్రే 60 లక్షల టన్నుల ఇసుకను దోచేశారని వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. నగరంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రావడం కోసం అనేక హామీలను కూటమి నేతలు గుప్పించారన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో ఇసుక నూతన పాలసీని తీసుకొస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుకనే కనిపించకుండా చేశారన్నారు. సూపర్ సిక్స్ హామీలలో ఉచితంగా ఇసుకను అందిస్తామని చెప్పిన నేతలు నేడు జిల్లాలోని ఇసుకనంతా టిడిపి నేతలు అక్రమంగా తరలిస్తూ అందిన కాడికి దోచుకుతింటున్నారన్నారు. చంద్రబాబుకానీ, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న నారా లోకేష్‌కుగానీ, జిల్లాలో జరుగుతున్న ఇసుక దోపిడి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. జిల్లాలోని అన్ని నది పరివాహక ప్రాంతాల్లోని ఇసుకను తోడేస్తున్నా అధికారులకు కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. ఇసుక దోపిడి యదేచ్ఛగా జరుగుతున్నా అధికార యంత్రాంగం స్టేట్ మెంట్‌లకు పరిమితమవుతూ ప్రేక్షకపాత్ర వహిస్తోందని విమర్శించారు. అధికారులకు ఇసుక దోపిడిని అడ్డుకునే చేత కాకుంటే మా వద్దకు వస్తే ఎక్కడ నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నది చూపిస్తామన్నారు. గతంలో ఇసుక ద్వారా రూ. 900 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం వచ్చేదని, అయితే నేడు ఆదాయ మంతా టిడిపి నేతలకే వెళ్తూ ప్రభుత్వానికి ఒక్క రూపాయి కూడా రాని పరిస్థితి ఏర్పడిందని, విమర్శించారు. టిడిపి నేతలు కృత్రిమ ఇసుక కొరతను సృష్టిస్తూ నిర్మాణ రంగంపై ఆధారపడ్డ లక్షల మంది పేదల కడుపుకొడుతున్నారని విమర్శించారు. బహిరంగంగానే టిడిపి నేతలు ఇసుకను తరలిస్తుంటే వాటిని అరికట్టలేని నిస్సహాయ స్థితిలో చంద్రబాబు నాయుడు ఉన్నారా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు మీ కంట్రోల్‌లో లేరా, ఇసుక అవినీతిలో మీకీ పర్సెంటేజీ వస్తోందా అని చంద్రబాబు, లోకేష్‌లను ఆయన ప్రశ్నించారు. అదే విధంగా దేశంలో ఎక్కడా లేని విధంగా నాణ్యమైన మద్యాన్ని అందిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఏకైక నాయకుడు చంద్రబాబు మాత్రమే నని ఎద్దేవా చేశారు. ఆచరణలో మాత్రం మద్యం టెండర్లలో ఎవరూ పాల్గొనకుండా ప్రతి ఎమ్మెల్యే బెదిరింపులకు పాల్పడుతుండటం ఆశ్చర్య పరిచేలా ఉందన్నారు. ఏకంగా డిఎస్‌పి, సిఐలే ఎవరైనా టెండర్లు దాఖలు చేస్తే వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి వ్యాపారాలు చేసుకోలేరని డిడిలు కట్టవద్దని చెబుతుండటం తొలిసారిగా చూస్తున్నామన్నారు. 2019కంటే ముందు తెలంగాణ, కర్ణాటక, ప్రాంతాలను నుంచే కాకుండా పెద్ద ఎత్తున వ్యాపారులు మద్యం షాపులకు టెండర్లు వేసే వారని తద్వారా రాష్ట్రానికి కూడా ఆర్థిక ప్రయోజనం చేకూరే ప్రయోజనం ఉండేదన్నారు. నేడు అందుకు భిన్నంగా టిడిపి నేతలు సిండికేట్‌గా మారి ఎవరినీ టెండర్లు వేయనీయకపోవడంతో 50 వేల మందికి కూడా ఇప్పటికీ టెండర్లు వేయలేదన్నారు. ఎస్‌పి, కలెక్టర్లు కూడా వాస్తవ పరిస్థితిని, చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లడం లేదా అని ఆయన ప్రశ్నించారు. జిల్లాలో ఇసుక కృత్రిమ కొరత మద్యం టెండర్లలో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహించాలని ఆయన సూచించారు. జిల్లా అంతటా నదీ పరివాహక ప్రాంతాల్లో యంత్రాలను అందుబాటులో ఉంచి ఇసుకను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. జిల్లాలో నూతన సాంప్రదాయానికి కూటమి నేతలు తెర లేపుతున్నారని, చంద్రబాబు అనుభవం ఇదేనా అని, ఇదేమి సంస్కృతి అని ఆయన ప్రశ్నించారు. కూటమి నేతలపై కూడా టిడిపి నేతలు దాడులు చేస్తున్న కంట్రోల్ చేయలేని స్థితిలో చంద్రబాబు ఉన్నారని విమర్శించారు. కలెక్టర్, ఎస్పీలు స్పందించాలని, కొందరి చేతుల్లోకే అక్రమ సంపాదన పోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇసుకను అందు బాటులోకి తీసుకురావాలని, మద్యం దుకాణాల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, లేదంటే వైసీపీ నేతలే రోడ్లపైకి రావాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కార్పోరేటర్ టి వి.చంద్రమోహన్‌రెడ్డి, నగరాధ్యక్షులు చింత సోమశేఖర్‌రెడ్డి, వైసీపీ నేతలు గోగులపుల్లయ్య, హుస్సేన్, రాధాకృష్ణ, దాదు, అంజి తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు ఎక్కు పెట్టారు..చౌక బియ్యం పట్టారు..!

## ఃరెండు వాహనాలు, 49 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం - అయిదుగురు నిందితులపై కేసు నమోదు


407 వాహనంతో పాటు స్వాధీనం చేసుకున్న చౌక బియ్యం


ఆటోలో తరలిస్తున్న బియ్యంతో పాటు చోదకున్ని చూపుతున్న అధికారులు

యాడికి(తాడిపత్రి), అక్టోబరు 8, ప్రభాతవార్తః మూడు నెలలుగా మూడు ఆటోలు, ఆరు ఐచర్లుగా సాగుతున్న చౌక బియ్యం అక్రమ రవాణాపై ఎట్టకేలకు అధికారులు మంగళవారం ఎక్కు పెట్టారు. రెవెన్యూ, పోలీసు అధికారులు సంయుక్తంగా జరిపిన దాడుల్లో రెండు వాహనాలతో పాటు 49 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాడిపత్రి, అవుకు, కొలిమిగుండ్ల తదితర ప్రాంతాలతో పాటు యాడికి మండల పరిధిలోని గ్రామాల నుంచి సేకరించి యాడికి, రాలయచెరువు కేంద్రంగా ఇతర ప్రాంతాలకు సాగుతున్న చౌక బియ్యం అక్రమ రవాణాకు ఎట్టకేలకు అధికారులు అడ్డుకట్ట వేయగలిగారు. అధికారులు మంగళ వారం స్వాధీనం చేసుకున్న చౌక బియ్యం విలువ నల్లబజారులో సుమారు రూ. 1.30 లక్షలు ఉండవచ్చని అంచనా. ఏపీ02 టీఏ 1770 నంబరు గల ఆటోను,ఏపీ 02 డబ్ల్యు 9616 నంబరు గల 407 వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పిన్నేపల్లికి చెందిన నారాయణ స్వామి, మహేంద్ర, యాడికికి చెందిన కృష్ణకుమార్, జక్కసాని గుంట్లకు చెందిన రఘురాముడు, రంగాపురానికి చెందిన సుంకన్నలపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో సీఐ ఈరన్న, ఏఎస్సై వెంకటేష్, సీఎస్‌డీటీ సూర్యనారాయణ,ఆర్ ఆనందబాబు ఆచారి, వీఆర్వో అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

## - అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ - కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు తహాశీల్దార్ కార్యాలయాల తనిఖీ


రికార్డు గదిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్


తహాశీల్దార్‌కు సూచనలు చేస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ఉరవకొండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త

తహాశీల్దార్ కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. మంగళవారం ఆయన ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు, ఉరవకొండ, వజ్రకరూరు మండల తహాశీల్దార్ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ కార్యాలయాల్లో రికార్డు గదులను పరిశుభ్రంగా ఉంచాలని, రికార్డులను క్రమ పద్ధతిలో అమర్చి వాటి యొక్క వివరాలు తెలుపు విధంగా సూచన కార్డులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి తహాశీల్దార్ కార్యాలయంలోనూ రికార్డు గదికి సంబంధించిన రిజస్టరును నిర్వహించాలన్నారు. అన్ని కార్యాలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ ఉండాలన్నారు. ఉద్యోగులందరూ నిర్ణీత సమయంలో కార్యాలయానికి హాజరు కావాలన్నారు. భూమి సమస్యలు, రెవెన్యూ సేవల మీద ప్రత్యేక దృష్టి ఉంచి వాటిని నిర్ణయించిన సమయంలో పరిష్కరించాలన్నారు. కార్యాలయాల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా, డిప్యూటీ తహాశీల్దార్ పి.భోగనగౌడ్ సిబ్బంది ఉన్నారు.

# మారెమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు


అమ్మ వారిని తీసుకు వస్తున్న మహిళలు


అమ్మవారిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

కణేకల్లు, అక్టోబర్ 08 ప్రభాతవార్త:

కణేకల్లు పట్టణంలో వెలసిన మారెమ్మ దేవాలయం మరియు తాయమ్మ దేవాలయంలో అమ్మవారు దేవర జాతర ఉత్సవాల్లో రాయదుర్గం శాసన సభ్యులు కాలవ శ్రీనివాసులు మంగళవారం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి వారు తెలుగుదేశం పార్టీ నాయకులు నాగభూషణం, గోపాల్, నాగరాజు, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులకు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. మారెమ్మ దేవాలయంలో ఉదయాన్నే గంగను తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రధాన వీధుల గుండా అమ్మవారిని తలపై ఉంచుకొని మేళతాళాలతో, డబ్బులతో ప్రధాన వీధుల గుండా అమ్మవారిని ఊరేగించారు. అమ్మవారికి మహిళలు కుంబాన్ని మోస్తూ హారతి పట్టారు. ఈ సందర్భంగా మారెమ్మ, తాయమ్మ దేవాలయాలలో అమ్మవారికి పొట్టేళ్లను బలి ఇచ్చి వారి మొక్కులను తీర్చుకున్నారు. ప్రతి ఏటా దసరా ఉత్సవాలల్లో భాగంగా మారెమ్మ దేవర జాతర ననిర్వహిస్తున్నట్లు ఆలయ సభ్యులు నాగభూషణం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆనం దరాజులు, కలేకుర్తి లాలెప్ప, గుడిగుండ్ల గంగాధర, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారు ఇంద్రాణిగా..మీనాక్షి దేవిగా.. అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు


జ్ఞాన పీఠం


పాత ఊరు అమ్మవారి శాలలో గంగా సమేత శివపార్వతుల అలంకారం


తపోవనంలో


శివకోటిలో.


వేపాకులతో రేణుక యల్లమ్మ

అనంతపురం కల్చరల్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

శరన్నవరాత్రులలో భాగంగా అమ్మవారు ఇంద్రాణిగా..మీనాక్షి దేవిగా.. అన్నపూర్ణాదేవిగా వివిధ రూపాలలో దర్శనమిచ్చారు.. రామచంద్ర నగర్ షిర్డిసాయిబాబా దేవాలయంలో దేవి శరన్నవరాత్రుల మహోత్సవంలో భాగంగా మంగళ వారం అమ్మవారు మహాలక్ష్మి రూపంలో భక్తులకు కటాక్షించారు. శ్రీ శివబాలయోగి మహారాజ్ ఆశ్రమంలో అమ్మవారు, మీనాక్షి అమ్మవారుగా అలంకరించుకుని భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. హెచ్ఎల్‌సి కాలనీలోని శ్రీ ఛాముండేశ్వరి ఆలయంలో అమ్మ వారు లలితా దేవిగా అలరించుకొని భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఒకటో రోడ్డులోని కాశీ విశ్వేశ్వర కోదండ రామాలయంలో శారద దేవి ఉదయం పార్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారు గజవాహనంపై ఇంద్రాణిగా ఆశీనులై భక్తులకు దర్శనమిచ్చారు. అక్కల్కోట్‌మహారాజ్ ఆశ్రమంలో శ్రీ కొల్హాపూర్ అమ్మవారు మహా లక్ష్మిగా అలంకరించుకొని భక్తులకు దర్శనమిచ్చారు. పాతూరులోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఉదయం పూజలు, అర్చన అభిషేకములు నిర్వహించారు. సాయంత్రం వాసవి మాత, గంగ సమేత శివపార్వతులుగా అలంకరించుకొని భక్తులకు సాక్షాత్కరించారు. హారతి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పిన్ని నాగరత్నం, వంకదారు వెంకటకృష్ణ, రంగయ్య తదితరులు పాల్గొన్నారు. శంకరమఠంలో శారదా మాత వీణా ధారణిగా సరస్వతి దేవిగా అలంకరించుకొని, భక్తులకు దర్శనమిచ్చారు. రెండవ రోడ్డులోని శ్రీజ్ఞానపీఠంలో ఉదయం పుణ్యావాహచనం, గోపూజ, అర్చన నిర్వహించారు. అమ్మవారికి శ్రీ చక్ర నవావరణ అర్చన, చండీ ఆవరణ అర్చనలు శాస్త్రోక్తంగా జరిగాయి. మహిళలతో లలిత సహస్ర నామ త్రిశతిలతో సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారు అన్నపూర్ణాదేవిగా అలంకరించుకొని సాక్షాత్కరించారు. ఉమా నగర్‌లోని శ్రీ రేణుక యల్లమ్మ వేపాకులతో అలంకరించుకొని భక్తులకు సాక్షాత్కరించారు. సూర్యనగర్‌లోని మల్లాలమ్మ ఆలయంలో అమ్మవారు వేదమాత గాయత్రి దేవిగా కటాక్షించారు. తపోవనంలో వెలసిన శ్రీవేద గాయత్రీ దేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలలో అమ్మవారు దాక్షాయినిగా అలంకరించుకొని భక్త జనులకు సాక్షాత్కరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ఎన్‌వి ప్రసాద్, గౌరవాధ్యక్షులు రామగోపాల్ ప్రధాన కార్యదర్శి రుద్రం అనంత్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎస్సీ శిక్షణకు శిక్షణా సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానం

అనంతపురం న్యూటౌన్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము ఎస్సీ, ఎస్టీ కేటగిరీలకు చెందిన నిరుపేద నిరుద్యోగులు డీఎస్సీ పరీక్షలకు సన్నద్ధము అవుతున్న వారికి ఆర్థికంగా, నైతికంగా చేయూతను అందించాలనే ఉద్దేశ్యంతో, అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలలో సత్ఫలితాలు పొందాలపని సత్సంకల్పముతో సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా 5050 మంది ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు రెసిడెన్సియల్ విధానంలో డీఎస్సీ శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడం జరిగిందని, ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను సంచాలకులు బి.లావణ్య జారీ చేశారని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఖుష్బూ కొఠారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ శిక్షణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడిన శిక్షణ సంస్థలలో, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖలు నిర్వహిస్తున్న స్టడీ సర్కిల్స్‌లో నిర్వహించబడుతుందన్నారు. ఎంపానెల్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునే శిక్షణా సంస్థలు గత రెండు డీఎస్సీ రిక్రూట్‌మెంట్లకు కోచింగ్ ఇచ్చి ఉండాలన్నారు. గతంలో జరిగిన డీఎస్సీ నియామకాలలో కనీసం వంద మంది ఉపాధ్యాయులుగా ఉద్యోగాలను పొంది ఉండాలి, మూడు సంవత్సరాలు సరాసరి టర్నోవర్ కనీసం రూ.40 లక్షలు ఉండాలని, డీఎస్సీ శిక్షణ సంస్థలు ఎంపానల్ చేయడానికి కావాల్సిన వివరాలతో కూడిన డాక్యుమెంట్ నెం 757795 ఏపీ ఈ ప్రొక్యూర్మెంట్ పోర్టల్ నుండి ఈనెల 7 నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఈనెల 21 అని, కావున ఆసక్తి గత శిక్షణా సంస్థలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలను జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ సమీపంలోని దామోదర్ సంజీవయ్య సంక్షేమ భవనంలోని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

# చదివిన పాఠశాలలు, కళాశాలలకు చేయూతనిద్దాం - జిల్లా కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

మనం చదివిన పాఠశాలలు, కళాశాలలకు చేయూతనిద్దామని ఇందుకు తమ వందు కృషి చేసి బావితరాలకు ఆదర్శంగా నిలుదామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా విద్యాశాఖ, సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలు, కళాశాలల్లో చదివిన పాఠశాలలో చదివి మంచి స్థాయిలో వున్న పూర్వం చదివిన విద్యార్థులతో ఒక వాట్సాప్ గ్రూప్‌ను తయారు చేసి వారు చదివిన పాఠశాలలో అవసరమైన సదుపాయాలకు సంబంధించి జాబి తాను తయారు చేసి వుంచాలన్నారు. తద్వారా ఆ స్కూల్, కళాశాల అభివృద్ధికి తోడ్పడే విధంగా చూడాలన్నారు. జిల్లాలో చదివిన జిల్లా అధికారులు, మండల అధికారులు, కెజిబివి, ఒకేషనల్ ఎడ్యుకేషన్, బిసి వెల్ఫేర్ హాస్టల్స్, సోషల్ వెల్ఫేర్, గురుకుల, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఒక్కొక్క వాట్సాప్ గ్రూప్ 7 రోజుల్లో తయారు చేయాలని ఆదేశించారు. అలాగే డబ్బు సహాయం కాకుండా వస్తువుల రూపంగా వారి నుండి సేకరించే విధంగా చూడాలని కలెక్టర్ తెలియచేశారు. ఈ సమావేశంలో ఎఇ కృష్ణయ్య, సర్వశిక్ష అభియాన్ ఏడి నాగ రాజు, ఎఎంఒ చంద్రశేఖర్, డివిఇఒ వెంకట రమణ నాయక్, డిటి డబ్ల్యుఒ రామాంజినేయులు, బిసి వెల్ఫేర్ డిడి కుష్బూ కొఠారి, జిల్లా ఉపాధి కల్పన అధికారి కళ్యాణి, సాంఘిక సంక్షేమ గురుకుల డిసిఒ ఉదయశ్రీ, కెజిబివి, ఐటిఐ,. పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# అన్ని సహకార సంఘాల్లో ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్


హాజరైన అధికారులు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 8 ప్రభాతవార్త

జిల్లాలోని అన్ని కోఆపరేటీవ్ సహకార సంఘాల్లో ఎరువుల అమ్మకాలు జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 34 కో ఆపరేటీవ్ సొసైటీలు వుండగా అందులో 11 సొసైటీల్లో ఎరువులు అమ్మకాలు జరుగుతున్నాయని మిగిలిన 23 సొసైటీల్లో 30 రోజుల్లోగా ఎరువుల వ్యాపారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఎంపిఎఫ్‌సి గోడౌన్లకు సంబంధించి మంజూరైన వాటిలో 52 భవనాలు ఇప్పటికే పూర్తికాగా మరో 50 గోడౌన్ల నిర్మాణాలు పురోగతిలో వున్నాయని పూర్తయిన గోదాముల్లో నెలరోజుల్లోపు సంబంధిత అధికారులకు అప్పగించాలన్నారు. కోఆపరేటీవ్ సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతులు డేటాకు సంబంధించి కంప్యూటరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, రోజు పురోగతి వుండాలని ఇందుకు సంబంధించిన రోజువారి నివేదికలు అందించాలన్నారు. కేటాయించిన లక్ష్యాల ప్రకారం సొసైటీలు పనిచేసేలా చూడాలని క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిసిఒ అరుణకుమారి, డిపిఒ ప్రభాకర్‌రావు, డిసిసిబి సిఇఒ సురేఖారాణి, ఫిషరీస్ డిడి శ్రీనివాసనాయక్, డిపిడిఎం తేజస్విని, వ్యవసాయశాఖ ఏడి రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా దర్బార్‌లో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె


ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

పుట్టపర్తి (కలెక్టరేట్),అక్టోబర్ 08, ప్రభాతవార్త

విజయవాడ మంగళగిరి టిడిపి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా దర్బార్ నందు మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వర్ రావుతో పాటు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా తెలుగుదేశం పార్టీ పని చేస్తుందన్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలు పంచుకుంటున్నారని, రాష్ట్రం నలుమూలల నుండి మంగళగిరి టిడిపి కార్యాలయానికి విచ్చేసిన టిడిపి కార్యకర్తలు,ప్రజలనుండి అర్జీలు స్వీకరించిన పల్లె రఘునాథ్ రెడ్డి వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.